# ప్రహ్లాదుడు

*(శ్రీహరి విశ్వాసమే ప్రహ్లాదుని ప్రధాన విశ్వాసము. నిరంతరము శ్వాసవలె హరిస్మరణ జరుగుచుండెడిది. తండ్రియైన హిరణ్యకశిపుడు ఇందుకు పూర్తి విరోధి. అనగా దైవమన్న అవిశ్వాసమేగాక తనకంటె వేరు దైవము లేదని వాదించు అహంకారి. అందుచే ప్రహ్లాదుని భక్తికి అనేక అంతరాయములు కల్పించెడివాడు. కానీ ప్రహ్లాదుడు వాటిని లెక్కచేయక తన పట్టు వీడక నిరంతరం నారాయణ చింతన చేసెడివాడు. అందువలన హిరణ్యకశిపుడు మరింత మండిపడి పుత్రభావము సహితము చిత్తమున ఆవంతయును లేక ఆ చిన్న బాలుని ఏనుగులచే నెట్టించెను. పాములచే కరిపించెను. అనేక బాధలు, భయములు పెట్టించెను. కడకు కఠినమైన యిద్దరు చండ, అమర్కులను గురువులను నీమించి, ప్రహ్లాదుని భక్తిని మార్పించుటకు ప్రయత్నించెను. ఏమిచేసిననూ ప్రహ్లాదుని విశ్వాసము చలించలేదు. భయపడలేదు. ప్రాణమును విడుచుటకైననూ ఆనందించును గానీ నారాయణుని నామమును విడచుటకంగీకరించలేదు. కడకు, తల్లియైన లీలావతితో కూడ చెప్పించెను. ప్రేమోన్మత్తుడై హరికి అర్పణమైన ప్రహ్లాదుని చిత్తమును ఎవరేమి చేయ గలరు? కాయభ్రాంతి లేనివానికి తల్లిదండ్రులను అభిమానమెట్లుండును? అది రాక్షసరాజు గమనించక ఒకనాడు కుమారుని పిలిపించి, మంచిమాటలాడి, దేవుడెక్కడున్నాడని ప్రశ్నించగా, ప్రహ్లాదుడు మందస్మిత వదనుడై సర్వాంతర్యామి హరి, ఎందుచూసినా అందే ఉన్నాడని అనగా అటులైన చూపగలవా అని ఉగ్రుడై అనెను. ప్రహ్లాదుడు వెరువక, తప్పక నేను చూచుచున్నానని గంభీర కంఠుడై పలుకగా, ఈ స్తంభమునందు కూడా కలడా అని తండ్రి అడిగిన ప్రశ్నకు ప్రహ్లాదుడు తప్పక కలడని చెప్ప తండ్రి స్తంభమును గ్రుద్దగా అందులోనుండి నరసింహస్వరూపుడై హరి ప్రత్యక్షమాయెను. ఉన్నాడన్న వారలకు ఉన్నాడు. లేడన్న వారికి లేడు. ప్రహ్లాదుడు దేవుడు యెక్కడ చూచిననూ కలడనుటచే కనిపించెను. లేడని తిరుగుటచే హిరణ్యకశిపునకు కనుపించలేదు. 'భావశుద్ధీ జ్ఞానసిద్ధి' అని ప్రహ్లాదుడు నిరూపించెను.)*

పుణ్యఫలము చేత పుట్టెను మనుజుడై
దుష్టతలపు చేత దుష్టుడయ్యె
జ్ఞానపథము వీడి మానవత్వము వీడె
ఇంతకన్నను రాక్షసత్వమేమి కలదు!

**నారాయణ ద్వేషం**

నారాయణుడు వరాహరూపము ధరించి హిరణ్యాక్షుని సంహరించిన విధమును అతని సోదరుడు కన్నులారా చూసి ఉద్రేకముతో, దుఃఖముతో నారాయణుని ఏవిధంగానైనా సంహరింపవలెనని దీక్షబూనాడు. ఎక్కడ యజ్ఞయాగాదులు జరుగుతున్నవో వాటిని ధ్వంసం చేయమని, ఎక్కడ భక్తులు జపతపములు ఆచరిస్తున్నారో వారిని సంహరించమని తన రాక్షససైన్యాన్ని ఆజ్ఞాపించాడు. ఈవిధంగా రాజ్యము ఘోరకృత్యముల పాలౌతూ వచ్చింది. నారాయణునిపై ద్వేషంతో నిద్రాహారాలు మాని, ఎక్కడ నారాయణుడు, ఎక్కడ నారాయణుడు అని సర్వత్రా వెతుకుతూ వచ్చాడు.

నారాయణుడు కలడన్నవారికి కలడు, లేడన్నవారికి లేడు. ఆస్తికుని హృదయమందు తాను ఎంత

పరిపూర్ణుడై ఉంటాడో నాస్తికుని హృదయమందు కూడా అంత పరిపూర్ణుడై ఉంటాడు. కనుక, భగవత్తత్త్వములో ఎట్టి భేదమూ ఉండదు. నాస్తికుడు మొగ్గవంటివాడు, ఆస్తికుడు పుష్పమువంటివాడు. నేటి మొగ్గ రేపు వికసిస్తుంది. అయితే, రేపటి లోపల యేచీడపురుగో పట్టి యీ మొగ్గను నాశనం చేయవచ్చు.

## ప్రహ్లాద జననం

హిరణ్యకశిపుడు ముందుగా కఠోర తపస్సునాచరించి మరణము లేకుండా చేసుకోవాలని సంకల్పించుకున్నాడు. అప్పటికే గర్భవతిగానున్న భార్య లీలావతిని వదలి మందర పర్వతానికి వెళ్ళాడు. ఇట్టి సమయము చూసి దేవతలు, హిరణ్యకశిపుడు చేసిన ఘోరకృత్యములకు ప్రతిఫలంగా, రాక్షసులను బాధిస్తూ వచ్చారు. అందుచేత నారదుడు లీలావతిని తన ఆశ్రమమునకు గొనిపోయాడు. హిరణ్యకశిపుడు తిరిగి వచ్చేంత వరకు నిత్యమూ ఆమెకు నారాయణుని లీలాగుణగణ విశేషములను బోధిస్తూవచ్చాడు. రాజ్యమునకు, పతికి దూరమైన లీలావతి తన దురవస్థకు చింతిస్తూ, నారదుడు చెప్పే విషయాలకు 'ఊ' కొడుతూ వచ్చిందిగానీ, వాటిని హృదయానికి చేర్చుకోలేదు. గర్భమందున్న శిశువు మాత్రం ఆ విషయములన్నింటినీ ఒక్కటీ వదలకుండా స్వీకరించాడు. ఆనాటినుండి గర్భములోనే, 'ఓంనమో నారాయణాయ' అని నారాయణ మంత్రమునే ఉచ్చరించసాగాడు. అందువల్ల జన్మించిన తక్షణమే ప్రహ్లాదుడు గొప్ప తేజస్సుతో తన తల్లికి కనిపించాడు. మందర పర్వతముపై హిరణ్యకశిపుని కఠిన తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. ఈ హిరణ్యకశిపుడు యేమి కోరాడు? 'బ్రహ్మా! ఈ సృష్టిలో యేమానవులచేగానీ, మృగములచే గానీ, క్రిమికీటకాదులచేగానీ, విషసర్పములచేగానీ, ఆకాశమునందుగానీ, భూమియందుగానీ నాకు మరణము సంభవించకూడదు' అన్నాడు. బ్రహ్మ అనుగ్రహించాడు. దానితో అతనికి ఒకవిధమైన ధైర్యము యేర్పడి అహంకారముతో స్వేచ్ఛావిహారం సల్పుతూ వచ్చాడు. 'ఈ ప్రపంచానికి నేనే దేవుడను' అనే అహంకారముతో ప్రవర్తిస్తూ వచ్చాడు. ప్రహ్లాదుడు ఉచ్చరించే, 'ఓం నమో నారాయణాయ' కు బదులు 'ఓం నమో హిరణ్యకశిపాయ' అని బోధించాడు. ప్రహ్లాదునికి ఐదు సంవత్సరములు వయస్సు వచ్చేటప్పటికి శుక్రాచార్యుని కుమారులైన చండామర్కులను పిలిపించి, 'నాకు ద్వేషియైన నారాయణుని నామం యితని నోట రాకూడదు. చతుర్విధ పురుషార్థములలో అర్థకామములు తప్ప ధర్మమోక్షాలను గురించి యితనికి బోధించకూడదు' అని శాసించాడు. ప్రభువైన హిరణ్యకశిపుడే భగవంతుడని చెప్పమన్నాడు.

## చండామర్కుల బడి

ప్రహ్లాదునితోబాటు అనేక రాక్షసబాలురను కూడా విద్యాలయంలో చేర్చుకొని చండామార్కులు వారికి అసుర గుణములను బోధించారు. రాత్రింబవళ్లు నారాయణునికి విరుద్ధమైన బోధలు సల్పారు. కాని, ప్రహ్లాదుని హృదయంలో నిరంతరము నారాయణుని చింతన నిండియుండుటచేత మరొక చింత అందులో ప్రవేశించే అవకాశమే లేకపోయింది. కాని, విన్నట్లుగానే నటించాడు. చండామర్కులు ఆనందించారు. కొన్ని దినములు గడచిన తరువాత హిరణ్యకశిపుని దగ్గరకు ప్రహ్లాదుని తీసుకొని వెళ్ళారు.

## తండ్రి పరీక్ష

హిరణ్యకశిపుడు అత్యంత ప్రేమతో ప్రహ్లాదునితొడపై కూర్చుండ బెట్టుకొని తల నిమురుతూ, 'నాయనా! గురువులు ఏమి నేర్పేరు నీకు?' అని అడిగాడు. ఈ చిన్నవాడు నవ్వుతూ అన్నాడు,

*చదివించిరి నను గురువులు*
*చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే*
*చదివినవి కలవు పెక్కులు*
*చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!*

'నాయనా! సర్వవిద్యల సారమును ఒక్క వాక్యములో చెప్పు చూద్దాం' అన్నాడు హిరణ్యకశిపుడు. 'ఓం నమో నారాయణాయ' అన్నాడు ప్రహ్లాదుడు. హిరణ్యకశిపుడు మాట్లాడలేదు. గురువులవైపు చూసాడు. గురువులు ఒకరినొకరు చూసుకొన్నారు. ఈ పిల్లవాడు మాకు ప్రమాదం తెస్తున్నాడని లోలోపల చాలా భయపడ్డారు. హిరణ్యకశిపుడు గురువులను గట్టిగా మందలించాడు గానీ, మొదటిసారి ప్రహ్లాదుని భయభ్రాంతులకు గురిచేయలేదు. 'తీసుకొని వెళ్ళండి. రాత్రింబవళ్ళు ఇతనికి గుణములు బోధించండి' అని మళ్లీ ఆజ్ఞాపించాడు. కానీ, ఎంత చెప్పినా ప్రహ్లాదునిలో అవేవీ చేరలేదు. కొంతకాలమైన తరువాత మళ్లీ తండ్రి దగ్గరకు తీసుకువచ్చారు. 'ఓం నమో నారాయణాయ' అనే నామము స్మరిస్తూ వచ్చాడు ప్రహ్లాదుడు.

**తీవ్రశిక్ష**

హిరణ్యకశిపుడు ఉగ్రుడయ్యాడు. క్రోధముతో కుమారుని ప్రక్కకు నెట్టాడు. 'వీడు రాక్షస వంశానికే అపకీర్తి తెస్తున్నాడు. ఈ చదువు నాకు అక్కరలేదు' అనుకొని, కుమారునికి తానే సరియైన శిక్షణ యివ్వాలనుకున్నాడు. ప్రహ్లాదుని చేరదీసి, 'నాయనా! నాలో ఉన్న శక్తులు ఏ నారాయణునిలోనూ లేవు. పంచభూతములను, సూర్యచంద్రాదులను కూడా హస్తగతము గావించుకున్నాను. సర్వశక్తులూ నాయందే ఉన్నాయి. సర్వమును జయించాను' అని చెప్పేటప్పటికి, ప్రహ్లాదుడు ఫక్కున నవ్వాడు. 'నాన్నా! ఇన్ని జయించావుగానీ, నీ యింద్రియాలను జయించలేక పోతున్నావు. లోని శత్రువులకు లొంగిపోయినవాడు బయటి రిపులనెట్లు పట్టగలడు? మొట్టమొదట నీ అహంకారమును నిర్మూలించుకో. దైవప్రేమను పెంచుకో. అప్పుడు నీ జీవితము, నీ రాజ్యము, నీ సంపదలన్నీ అభివృద్ధి అవుతాయి' అన్నాడు. హిరణ్యకశిపుడు మరింత ఉగ్రుడై, ప్రహ్లాదుని క్రిందకునెట్టి, 'నీవా నాకు బోధలు చేసేవాడవు? నాకు తెలియనిది నీకు తెలుసునా?' అని గర్జించాడు. చండామార్కులు ఎంత ప్రయత్నించినప్పటికీ ప్రహ్లాదుని భావములో మార్పు లేదు. చిత్తములో గాఢంగా హత్తుకుపోయిన నారాయణుని నామచింతనను తీయటానికి ఎవ్వరికీ వీలుకాదు. ఏవో బాహ్యామైన బోధల వల్ల చేరిన వాటిని కొంత దూరంగావించ వచ్చునేమోగానీ, చిన్నతనములోనే హృదయంలో హత్తుకుపోయిన నారాయణనామాన్ని వేరుచేయటానికి వీలు కాలేదు. కనుక, ఇట్టివాడు బ్రతికి ఉంటే భవిష్యత్తులో తనకు ఆటంకాలు కలిగిస్తాడేమోననే ఉద్దేశ్యముతో కన్న కొడుకునే చంపటానికి పూనుకున్నాడు తండ్రి. ఎదురుగానే కత్తులు తెప్పించి దుర్మార్గులచేత పొడిపిస్తూ వచ్చాడు. కాని, ప్రహ్లాదుడు యేమాత్రమూ చలించలేదు. 'ఏమిటీ పాంచభౌతికమైన  దేహము? నీవు కేవలం ఈ దేహాన్ని శిక్షిస్తున్నావు. దీనికీ నాకు సంబంధము లేదు. ఇది నేను ధరించిన వస్త్రము వంటిది. దీనిపై నాకు అభిమానము లేదు. తండ్రీ! నీకు దేహాభిమానము అధికంగా ఉంటున్నది. ఇదే అహంకార మమకారములకు మూలకారణం. అశాశ్వతమైన దేహాన్ని శాశ్వతమని భావించి నిత్యసత్యమైన ఆత్మతత్త్వాన్ని విస్మరిస్తున్నావు' అని బోధించాడు. కుమారుని పెట్టే హింసలను చూడలేక లీలావతి పతి పాదాలపైబడి అనేకవిధాలుగా ప్రార్థించింది. హిరణ్యకశిపుడు ఈ లీలావతి బాధను భరించలేక ప్రహ్లాదుని దూరంగా తీసుకువెళ్ళి చంపమని ఆజ్ఞాపించాడు.

ప్రహ్లాదుడు తన తల్లియైన లీలావతి దగ్గరకు వచ్చి,' అమ్మా! హరిప్రియుడైన నాకును, హరిద్వేషియైన నా తండ్రికిని ఒక్కటే భేదము' అన్నాడు. 'నేను భగవంతుని ప్రేమిస్తూ, స్మరిస్తూ అతని ప్రేమరసామృతమును గ్రోలి నా హృదయమును నింపుకొని మత్తుడనై, ప్రేమోన్మత్తుడనై, తాదాత్మ్యభావనతో ఆనందాన్ని అనుభవిస్తున్నాను. నా తండ్రి  హిరణ్యకశిపుడు నారాయణుని ద్వేషించి తన హృదయమును కఠినమైన శిలగా మార్చుకొని ఆ శిలయందే నారాయణుని ప్రతిష్ఠ చేసుకున్నాడు'. హరిని ద్వేషించిన హిరణ్యకశిపుని హృదయమందును, హరిని ప్రేమించిన ప్రహ్లాదుని హృదయమందును ఉన్నది ఒక్కడే హరి. ద్రవరూపమైన ప్రేమను ఆరగించి దాహమును తీర్చుకొని తనయొక్క తాపమును చల్లార్చుకున్నాడు ప్రహ్లాదుడు. కఠినమైన హృదయమందు హరిని ప్రతిష్ఠించుకొని తాను తన తాపమును చల్లార్చుకొనలేక, దాహమును తీర్చుకొనలేక తాను అనేకవిధములైన అవస్థలకు గురయ్యాడు

హిరణ్యకశిపుడు.

ఈ బాలుని హింసించటానికి రాక్షసులకు కూడా మనస్కరించలేదు. కాని, రాజాజ్ఞను శిరసావహించక తప్పదు కదా! ప్రహ్లాదుని క్రింద పరుండపెట్టి మదపుటేనుగులతో త్రొక్కించారు. దేహాభిమానమే లేనివారికి బాధ యేరీతిగా సంభవిస్తుంది? విషసర్పములను అతనిపై పెట్టారు. పెద్ద పర్వతములపైనుండి నెట్టారు. ప్రహ్లాదుని నోట, 'ఓం నమో నారాయణాయ' అనే మాట తప్ప మరో మాట రాలేదు. నారాయణుని నమ్ముకొన్న వారికి ఏ బాధలూ ఉండవు కదా! చండామార్కులు తిరిగి వచ్చి హిరణ్యకశిపునితో చెబుతున్నారు.

*తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుడు మాటిమాటి కో*
*పన్నగశాయి! యో దనుజభంజన! యో జగదీశ! యో మహా*
*పన్న శరణ్య! యో నిఖిల పావన! యంచు నుతించుగాని తా*
*కన్నుల నీరుతేడు భయకంప సమేతుడుగాడు భూవరా!*

**సర్వోపగతుడు**

భయమే లేదు. దేనికీ వెరువడు. చిరునవ్వులతో నారాయణమంత్రాన్ని ఉచ్చరిస్తున్నాడు. 'ఇంక యిది మా చేతకాని పని' అన్నారు భటులు. నిజంగా వీరు ప్రహ్లాదుని హింసిస్తున్నారో లేదోననే అనుమానం హిరణ్యాశిపునిలో బయలుదేరింది. చాలా కఠోరమైన విషమును తానే స్వయంగా తెప్పించి ప్రహ్లాదుని త్రాగమన్నాడు. ప్రహ్లాదుడు నవ్వుతూ, నవ్వుతూ, 'ఓం నమో నారాయణాయ' అని త్రాగాడు. కానీ , చావలేదు! 'గురువులు చెప్పింది పరమ సత్యమే. వీనిలో ఏదో భూతమో ప్రేతమో పిశాచమో ఉంటున్నది. ఇది దైవ శక్తి కాదు. నా శక్తే దైవశక్తి' అని అనుకొని అనేక మంత్ర తంత్రముల వారిని రప్పించాడు. కానీ, ఏమిచేసినా ప్రయోజనం లేకపోయింది. చివరకు నిరాశకు గురియై, 'నీ నారాయణుడు ఎక్కడ ఉన్నాడు? ' అని గర్జించాడు. ప్రపంచమంతా అణుమయమే అని కనిపెట్టటానికి సైంటిస్టుకు వేయిసంవత్సరాలు పట్టింది. కాని, దానికంటె పూర్వమే ప్రహ్లాదుడు కనుగొన్నాడు. సర్వత్ర ఉన్నది భగవంతుడే.

*ఇందుగలడందు లేడని*
*సందేహము వలదు చక్రి సర్వోపగతుం*
*డెందెందు వెదకి చూచిన*
*నందందే గలడు దానవాగ్రణి వింటే.*

'ఇందు గలడందు లేడని సందేహము వలదు' ఎక్కడ చూచినా ఉన్నది భగవంతుడే. కాని, నాన్నా! దేహాభిమానంతో నీవు దైవాన్ని చూడాలనుకుంటున్నావు. కేవలం భౌతికమైన సుఖసంతోషాలకు ప్రాకులాడుతున్నావేగానీ, దైవానుగ్రహానికి నీవు ప్రాకులాడటం లేదు. అహంకార మమకారాలతో జీవిస్తున్నావు. అహంకారము అధఃపతనానికి దారితీస్తుంది. దైవాన్ని పొందాలంటే వినయవిధేయతలు ఉండాలి. నీవు గొప్ప వైజ్ఞానికుడవు. కాని, రాక్షసత్వాన్ని పెంచుకుంటున్నావు. ముందు నీ చిత్తమును స్వాధీనము చేసుకో. ఇంద్రియాలను వశము చేసుకో. అప్పుడుగానీ సర్వవ్యాపకుడైన భగవంతుని చూడలేవు' అని బోధిస్తూ వచ్చాడు.

ఈనాటి మానవుడు కూడా, 'నీది, నాది' అనే అభిమానంతో, దేవుడెక్కడ అని దేవులాడుతున్నాడు. అట్టివారికి ఎంత వెతికినా చిక్కడు. ఏకాత్మభావం ఆవిర్భవించాలి. భగవంతునికి జీవితము అర్పితం కావాలి. సర్వకర్మలను దైవభావంతో ఆచరించాలి. ప్రహ్లాదుడు తినే తిండియందు, త్రాగే నీటియందు నారాయణుని చింతిస్తూవచ్చాడు. విషం త్రాగినా ఆనందంగా ఉన్నాడు. ఎక్కడ చూచినా భగవంతుడు కనిపిస్తున్నా డన్నాడు. కాని, హిరణ్యకశిపునికి ఎంత వెతికినా కనిపించలేదు. అంధులైనవారిముందు ఎంత పవర్‌ఫుల్ బల్బు పెట్టినా వారికి చీకటేగానీ వెలుతురు కనిపించదు. అట్లే, దేహభావమే తప్ప దైవభావము లేని జ్ఞానాంధులకు భగవంతుడేరీతిగా కనిపిస్తాడు? నారాయణ భావంలో లీనమైన ప్రహ్లాదునికి మాత్రం ఎక్కడ చూచినా

నారాయణుడే. క్రింద, మీద, చుట్టూ, లోపల, వెలుపల సర్వత్రా నారాయణుడే.

**ఎక్కడరా హరి?**

హిరణ్యాక్ష హిరణ్యకశిపులు సామాన్యమైనవారు కాదు. జయవిజయులే! హిరణ్యాక్షుని చంపినాడని హిరణ్యకశిపునికి విష్ణువుపైన చాలా కోపం వచ్చింది. 'విష్ణువు ఎక్కడున్నా అతనిని పట్టాలి...! కొట్టాలి...' అనుకొని సముద్రాలను శోధించాడు, ఆకాశములో సంచరించాడు, పంచభూతాలను పరిశీలించాడు. కాని, విష్ణువు ఎక్కడా కనిపించలేదు. ఐతే, హిరణ్యకశిపునికి భయపడి విష్ణువు పారిపోయాడా...? కాదు. కాదు. విష్ణువు ఎక్కడ చూచినా ఉన్నాడు. కాని, ఈ విషయాన్ని తానే చెప్పుకోకూడదు. హిరణ్యకశిపుని కొడుకు ద్వారానే చెప్పించాలి. చివరకు హిరణ్యకశిపుడు భగవంతుడు ఎక్కడా లేడని భావించి, ప్రహ్లాదునితో, 'ఒరేయ్ పిచ్చివాడా! 'హరి, హరి' అంటూ చాలా పొగడుతున్నావు. నీ హరి ఎక్కడున్నాడో నాకు చూపించు. పంచభూతాలను నేను పరిశోధించాను. కాని, నాకెక్కడా కనిపించలేదు. కనుక, ఈ హిరణ్యకశిపుడే భగవంతుడు. 'ఓంనమో హిరణ్యకశిపాయనమః' అని ఉచ్చరించు' అన్నాడు. అప్పుడు ప్రహ్లాదుడు అన్నాడు, ' ఛీఛీ...!ఛీఛీ...! హరిద్వేషిని నేను పూజించటమా! నా హరి సర్వత్రా ఉంటున్నాడు' అన్నాడు ప్రహ్లాదుడు. అంతకుముందు హిరణ్యకశిపుడు ఎక్కడెక్కడో తిరిగినా హరి చిక్కలేదు. అనగా, విశ్వాసం కలిగిన వారికి భగవంతుడు సర్వత్రా కనిపిస్తాడు కాని, విశ్వాసం లేనివారికి ఎదురుగా ఉన్నా కనిపించడు. కనుక, భగవంతునికి శక్తిసామర్థ్యాలు లేవని భావించరాదు. భగవంతునికి శక్తి ఉన్నది. కాని, సరియైన కాలం రావాలి. మంచిగాని చెడ్డగాని పండిన తరువాతనే చెట్టునుండి క్రిందకి రాలుతుంది. అది పండటానికి తగిన కాలం తీసుకుంటుంది. అందువల్లనే, భగవంతుడు కూడా కొన్ని చర్యలకు ఒక్కొక్కసారి ఎక్కువ కాలం తీసుకుంటాడు. అంతమాత్రంచేత, 'భగవంతునిలో శక్తి లేదు. ఉంటే...ఎందుకీవిధంగా చేయలేకపోయాడు?' అని విమర్శించటం సరియైన లక్షణం కాదు.

**నృసింహం**

ప్రహ్లాదుడు తండ్రితో, 'నాన్నా! ఈ ప్రపంచము అగ్నిలో కాలిన పెద్ద గుండు వంటిది. ఈ గుండు లోపల, వెలుపల, సర్వత్రా ఉంటున్నది అగ్ని. నాన్నా! తాకితేగానీ నీకు వేడి తెలియదు. ఆచరణ లేక అనుభూతి రాదు. నా మాట విను. ఎక్కడ చూచినా భగవంతుడున్నాడు' అని అన్నాడు. కాని, మూర్ఖుడైన హిరణ్యకశిపుడు తన పట్టు వదల లేదు. 'ఎక్కడ చూసినా ఉన్నాడా? అయితే, ఈ స్తంభములో ఉన్నాడా?' అని ప్రశ్నించాడు. ఉన్నాడన్నాడు ప్రహ్లాదుడు. తక్షణమే హిరణ్యకశిపుడు గద తీసుకొని తన శక్తి కొలదీ గట్టిగా కొట్టాడు. అది రెండుగా చీలింది. అందునుండి ఒక భయంకరమైన రూపము బయలుదేరింది. అది మనిషికాదు, మృగముకాదు. దానిని చూసేటప్పటికి తాను బ్రహ్మనుండి పొందిన వరము గుర్తుకు వచ్చింది. 'ఆహా!నా మరణ మాసన్నమైనది. ఇది మనిషికాదు, మృగముకాదు' అనుకొన్నాడు. నారసింహుడు హిరణ్యకశిపుని చేయి పట్టుకొని తన తొడపై వేసుకున్నాడు. మళ్ళీ హిరణ్యకశిపునికి జ్ఞాపకం వచ్చింది. తాను క్రిందగాని, పైనగాని చావకూడదని కోరుకున్నాడు. కాబట్టి, తొడమీద వేసుకున్నాడు. ప్రాణమున్నదానితోగాని, లేనిదానితోగాని, రాత్రిగాని, పగలుగాని తనకు మరణముండకూడదని వరంపొందాడు. గోళ్ళు ప్రాణమున్నవి కాదు, లేనివి కాదు. అది రాత్రి కాదు, పగలు కాదు, సాయం సమయం. ఇవన్నీ తల్చుకుంటూ ఉండటం వలన అంత్యసమయంలో కూడా హిరణ్యకశిపుడు నారాయణుని స్మరించలేదు. అంత్యకాలములో దేనిని స్మరిస్తామో దాని ఫలితమే మరుజన్మలో ప్రాప్తిస్తుంది.

**భయమెందుకు?**

నారసింహుని చూసి అందరూ భయభ్రాంతులకు గురియౌతున్నారు, గజగజ వణుకుతున్నారు. కాని, ప్రహ్లాదుడు మాత్రం ఆనందంతో కన్నార్పక చూస్తున్నాడు. నారసింహుడు ప్రహ్లాదుని,'నాయనా! నా రూపం చూసి

నీకు భయం కల్గటం లేదా?' అని అడుగగా, 'నారాయణా! యద్భావం తద్భవతి. నిన్ను భయంకర స్వరూపముగా భావించిన వానికి నీవు భయంకరంగానే కనిపిస్తావు. కాని, నేను నిన్ను ప్రేమస్వరూపునిగా భావిస్తున్నాను. కనుక, నీవు ప్రేమస్వరూపునిగానే కనిపిస్తున్నావు. ఆనందమయునిగానే గోచరిస్తున్నావు. నాకు భయమెందులకు?' అన్నాడు. హిరణ్యకశిపుని శవాన్ని నారసింహుడు క్రింద పడవేసిన తరువాత ప్రహ్లాదుడు దగ్గరకు వెళ్ళి నమస్కరించాడు. తన తండ్రికి సద్గతి ప్రసాదించమని ప్రార్థించాడు. నారసింహుడు తన అవతారము సమాప్తం గావించుకునే ముందు ప్రహ్లాదుని యేమి కావాలో కోరుకోమన్నాడు. 'నారాయణా! నీవు తప్ప నాకేమీ అక్కర లేదు. నేను నీలో, నీవు నాలో జీవించాలి. ఈ ఏకత్వాన్ని నేను అనుభవించాలి. తుచ్ఛమైన వాంఛలతో అల్పజీవితమును గడపటం నాకిష్టము లేదు. ఈ భౌతిక జీవితం నాకు అక్కరలేదు' అనేటప్పటికి, నారసింహుని స్థానంలో శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై, 'ప్రహ్లాదా! నీబోటి బిడ్డలు ఈ జగత్తుకు ఆదర్శప్రాయులుగా ఉండాలి. నీ తండ్రి మరణించాడు కాబట్టి, ఈ రాజ్యమును నీవు పాలిస్తూ రాక్షసులనందరినీ మానవులుగా తీర్చి దిద్ది, సరియైన మార్గమును బోధించి, వీరు తిరిగి నాచెంతకు వచ్చేటట్లుగా చేయాలి. రాక్షసులనందరినీ మానవులుగా తీర్చిదిద్ది వారిని దైవత్వంలో చేర్చుటకే నిన్ను నిలుపుతున్నాను' అన్నాడు నారాయణుడు. అప్పుడు ప్రహ్లాదుడు, 'ఈ బాధ్యత నాపై పెట్టవద్దు. నాకు కావలసినది నీవు. ఇవన్నీ నీవు చేయవలసిన పనులు' అని పాదములపైపడి యెంతగానో ప్రార్థించాడు. కాని, ప్రతి ఒక్కరూ కాలకర్మకారణకర్తవ్యాలను పురస్కరించుకొని ప్రవర్తించాలి. దైవాజ్ఞను ఉల్లంఘించటానికి వీలుకాదు. నారాయణుడు ప్రహ్లాదుని తన తొడపై కూర్చుండపెట్టుకొని, 'నాయనా! నా దర్శన, స్పర్శన, సంభాషణములు మూడూ నీకు లభించాయి. దీనికి మించిన ప్రాప్తి మరొకటి లేదు. ఈ ప్రాప్తినే నీవు నిరంతరము చింతిస్తూ రాజ్యమును పాలించు' అని ఆజ్ఞాపించాడు. అంతర్ధానమయ్యాడు. కనుక, ప్రహ్లాదునికి రాజ్యపాలన తప్పలేదు. 'ఓం నమో నారాయణాయ' అని స్మరిస్తూ రాజ్యపాలన చేస్తూ వచ్చాడు. ఈవిధంగా తండ్రి దుర్మార్గుడైనా ప్రహ్లాదుడు మహాపవిత్రమైన జన్మను అందుకొన్నాడు. దానవ వంశములో పుట్టినప్పటికీ దైవానుగ్రహానికి పాత్రుడయ్యాడు.

**సత్యమేజయం**

ఒకానొక సమయంలో ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుడు, అంగీరసుని కుమారుడైన సుధర్ముడు వాదంలో పోటీపడ్డారు. 'గెల్చినవానికి ఓడినవాడు ప్రాణమునర్పించాలి' అని షరతు విధించుకున్నారు. ఐతే, పోటీలో జయాపజయాలను నిర్ణయించటానికి ఒక జడ్జి ఉండాలికదా! అతడు ఎట్టి సంకుచిత భావములు లేనివాడై, తన పర భేదభావములను పాటించనివాడై ఉండాలి. కనుక, ఈ యిరువురూ ప్రహ్లాదుని వద్దకు వెళ్ళి పోటీలో న్యాయనిర్ణేతగా ఉండమని ప్రార్థించారు. అందుకు ప్రహ్లాదుడు ఒప్పుకున్నాడు. వాదము ప్రారంభమైంది. ప్రహ్లాదుడు అన్నింటినీ గమనిస్తూ వచ్చాడు. కట్టకడపటికి విరోచనుడు ఓడినట్లు సుధర్ముడు గెలిచినట్లు నిర్ణయించాడు. దానితో సుధర్ముడు పట్టలేని ఆనందముతో ప్రహ్లాదుని పట్టుకొని, 'ప్రహ్లాదా! నీబోటి సత్యసంకల్పులు, పుణ్యపురుషులు ఉండటం చేతనే జగములంతా పగలుగా వెలుగుతున్నాయి. వాదంలో ఓడినవాడు గెలిచినవానికి ప్రాణమివ్వాలని తెలిసినప్పటికీ సత్యాన్ని పాటించి నీ కుమారుని ఓటమిని ఒప్పుకున్నావు. సత్యాన్నాస్తి పరోధర్మః. సత్యమును మించిన ధర్మము మరొకటి లేదు. సత్యమే దైవము. నీ సత్యమే నీ కుమారుని బ్రతికిస్తున్నది. కనుక, నీ కుమారుని ప్రాణం నేను తీసుకోను' అన్నాడు.

ప్రహ్లాదుడు నిరంతరము నారాయణ చింతన చేయటంచేతనే అతని పేరు ప్రహ్లాదుడని సార్థకమైంది. ప్ర ఆహ్లాద అనగా ఆహ్లాదమును పరిపూర్ణమైన స్వరూపములో అనుభవించినవాడు ప్రహ్లాదుడని అర్థము. వంశము రాక్షస వంశము. రూపము మానవ స్వరూపము. చిత్తము దైవచిత్తము. ఈ మూడింటి ఏకత్వమును పొందిన పవిత్ర స్వరూపుడే ప్రహ్లాదుడు. ఈ ప్రహ్లాదుడు నిరంతరము భారతీయ సంస్కృతిని ఆశ్రయించి తు.చ. తప్పక దానిని అనుసరిస్తూ ఆదర్శముగా ప్రజలకు అందిస్తూ వచ్చాడు.